నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: 33/11 కేవీ మల్లాపూర్ నోమా సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ నర్సింహ్మనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నర్సింహనగర్, శివహోటల్, అన్నపూర్ణకాలనీ, ఎన్టీఆర్‌నగర్, ఎస్ఎస్‌నగర్, మీర్‌పేట్, సాయిగార్డెన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని మల్లాపూర్ విద్యుత్ ఏఈ ప్రకటించారు.

అల్వాల్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా మచ్చబొల్లారం సబ్‌స్టేషన్ 11కేవీ చింతల బజార్ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చింతలబజార్, వివేకానందనగర్, ఆదిత్య బ్యాంకుకాలనీ, బొబ్బిలినగర్, హకీంపేట్ సబ్‌స్టేషన్ 11కేవీ రిసాలబజార్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రిసాలబజార్, ప్రేమ్‌నగర్, జీఎస్ఆర్ ఎన్‌క్లేవ్, బంజారావిలేజ్, కుటియా మందిర్ ప్రాంతాలో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు.

ఉప్పల్: హబ్సిగూడ 11కేవీ స్నేహపురి ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు స్నేహపురి కాలనీ, శ్రీనగర్ కాలనీ, భవానీనగర్, పీఅండ్‌టీ కాలనీ, హెచ్‌టీఎఫ్‌సీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ గణేష్ తెలిపారుజ.

కార్పొరేటర్ పర్యటన

మల్కాజిగిరి: కుమ్మరిబస్తీలో సమస్యలు పరిష్కరిస్తామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. బుధవారం కాలనీలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో విద్యుత్ దీపాలు వెలగడం లేదని, కొన్నిచోట్ల పాత ఇనుప స్తంభాలు ఉండటంతో విద్యుదాఘాతానికి గురికావాల్సి వస్తుందని తెలిపారు. దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులతో పాటు వాడుక నీటి సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. సంబంధిత విభాగం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

గంజాయి పట్టివేత

మల్లాపూర్: నాచారం పోలీస్‌స్టేషన్ పరిధి దుర్గానగర్‌లో గంజాయి విక్రయిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు ప్రభాకర్‌రెడ్డి బృందం బిహార్ రాష్ట్రానికి చెందిన విశాల్‌కుమార్ (24)ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



సినీహీరో సుమన్‌తో కరాటే విద్యార్థులు

మల్లాపూర్: జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో నాచారం సీడీఎస్ బిల్డింగ్ వద్ద నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ పోటీలో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మల్లాపూర్, నాచారంకు చెందిన చిదురాల సాయితేజ, గట్టు, భరత్, చెన్నమ్మ ప్రతిభ చాటారు. అంతర్జాతీయ కరాటే అధ్యక్షుడు సినీ హీరో సుమన్ చేతుల మీదుగా బ్లాక్ బెల్ట్‌ను అందుకున్నారు. కరాటే మాస్టర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కమిటీ సభ్యులపై కేసు

ఉప్పల్ : హెచ్‌సీఏ లీగ్ అండర్– 19 స్టేట్ సెలక్షన్ కమిటీ సభ్యులపై ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం చీటింగ్ కేసు నమోదైంది. హెచ్‌సీఏలో డబుల్ బర్త్ సర్టిఫికెట్లతో లీగ్‌లో ఎంట్రీ ఇస్తున్నారని, దీంతో అర్హులైన ఆటగాళ్లకు అన్యాయం జరుగుతుందని నిర్వాహకుల తీరుపై బాధితులు ఫిర్యాదు చేశారు. అర్హులైన వారిని పక్కన పెట్టి తనకు నచ్చిన వారిని సెలక్ట్ చేయడం సరికాదని పేర్కొన్నారు. లీగ్ కమిటీ సభ్యులైన సందీప్‌రాజన్, సుదీప్ త్యాగి, అబీబ్ అహ్మద్‌లపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

సోమశేఖర్‌కు ఉత్తమ అధ్యాపక అవార్డు

ప్రదానం చేసిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

రామంతాపూర్: లీడ్ ఇండియా– 2025 ఉత్తమ అధ్యాపక అవార్డు రామంతాపూర్ వెంకట్‌రెడ్డి నగర్ విజ్ఞాన్ జ్యోతి గ్రామర్ హైస్కూల్ ప్రిన్సిపాల్ వేములకొండ సోమశేఖర్‌గౌడ్‌కు ప్రకటించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం రవీంద్రభారతిలో జరిగిన ఓ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అవార్డును సోమశేఖర్‌కు అందజేశారు.

సైబర్ బాధితులకు రీఫండ్ ఆర్డర్స్

అల్వాల్: నేరెడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సైబర్ బాధితులకు సుమారు రూ.10.70 లక్షలు కోర్టు ద్వారా ప్రాసెస్ చేసిన రీఫండ్ ఆర్డర్స్‌ను బుధవారం పోలీసులు బాధితులకు అందజేశారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. సైబర్ వెర్టికల్ హెడ్ కానిస్టేబుల్ కాంతయ్య, స్వప్నరెడ్డి, బాధితులు, తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా సమస్యలే !

● అధ్వానంగా రోడ్లు, కనీస సౌకర్యాలు కరువు ● పట్టించుకోని సంబంధిత అధికారులు



రోడ్లపై ఇష్టానుసారంగా వ్యర్థాల పారబోత



కాలనీ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంత

అల్వాల్: అందమైన పార్కులు.. ఓపెన్ జిమ్‌లు.. నగరంలో ఓ వైపు ఆధునీకరణ జరుగుతుంటే అల్వాల్ సర్కిల్ పరిధిలోని ఖానాజీగూడ గ్రీన్‌ఫీల్డ్స్ కాలనీ కనీస వసతులకు నోచుకోవడం లేదు. కాలనీ ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా.. అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిరుమలగిరి నుంచి కొంపల్లికి వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఈ కాలనీలో అధికంగా విశ్రాంత ఉద్యోగులు నివసిస్తుంటారు. విశాలమైన రోడ్లతో ఏర్పాటైన ఈ కాలనీలో ఇప్పటికీ అభివృద్ధి జాడలేదనే స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అవస్థలు పడుతున్న ప్రజలు..

సరైన డ్రైనేజీ నిర్వహణ లేకపోవడంతో పాటు ప్రధాన రోడ్లలో సైతం గుంతలు ఏర్పడి ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. కాలనీలో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతుందని కాలనీవాసులు వాపోతున్నారు. ఖాళీగా ఉన్న ప్లాట్‌లలో కొందరు అక్రమంగా వ్యర్థాలు డంపింగ్ చేయడం, భారీ వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల కాలనీవాసులకు సమస్యగా మారుతుందని కాలనీవాసులు వాపోతున్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదులు చేసినా..

కాలనీలో నెలకొన్న సమస్యలపై పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు స్పందించడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా గ్రీన్‌ఫీల్డ్స్ కాలనీ సమస్యలపై అధికారులు దృష్టిసారించాలని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు కోరుతున్నారు.

కనీస వసతులు కల్పించండి..



కాలనీలో నెలకొన్న సమస్యలతో అవస్థలు పడుతున్నాం. అధ్వానంగా రోడ్లు, అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ కాలనీలో వ్యర్థాల డంపింగ్, వీధి లైట్లు వెలగకపోవడం వంటి పలు సమస్యలు కాలనీలో నిత్యం ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– జ్ఞానేశ్వర్, గ్రీన్‌ఫీల్డ్స్ కాలనీ

ఉపాధ్యాయులను కేటాయించాలి



జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ఉప్పల్: చిలుకానగర్ ఎంపీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను కేటాయించాలని బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. విద్యార్థులు ఉన్నా.. సరిపడా ఉపాధ్యాయులు లేరని లెలిపారు. గతేడాది దాదాపు 82 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. దీనితో పాటు పదోతరగతిలో అత్యధికశాతం మార్కులు సాధించాలని సూచించారు. విద్యార్థులకు సరిపడ ఉపాధ్యాయులను కేటాయించాలని వినతిపత్రంలో కోరారు. కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, చిలుకానగర్ బీఆర్ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు సమస్యను పరిష్కరించండి

మల్కాజిగిరి: బాలసరస్వతీనగర్‌లో ముంపు సమస్యను పరిష్కరించాలని స్వచ్ఛభారత్ మల్కాజిగిరి కన్వీనర్ నాగరాజు కాలనీవాసులతో కలిసి సర్కిల్ ఈఈ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు. నాగరాజు మాట్లాడుతూ.. యూజీడీని పొడిగించడమే కాకుండా పైపులైన్ ద్వారా నీటిని మళ్లించాలని కోరారు. ఇంకుడు గుంతలతో పాటు మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేయడం వల్ల అదనపు నీటిని ఉపయోగించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కాలనీలో పర్యటించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. విఠోబా, నారాయణ, వెంకటేష్, భూషణ్, విజయ తదితరులు పాల్గొన్నారు.

దొంగలొస్తున్నారు జాగ్రత్త.. !

రామంతాపూర్: గతంలో ఏ అర్ధరాత్రో దొంగలు ఇంట్లోకి చొరబడి దొంగతనాలకు పాల్పడేవారు. ఇటీవల ఇంట్లో ఏ వస్తువు దొరికినా దొంగలు వదలడం లేదు. గత 3 నెలల క్రితం స్థానిక శ్రీనగర్‌కాలనీలోని పలు ఇళ్లల్లో ఇంటి బయట ఉంచిన చెప్పులు, షూస్‌తో పాటు పిల్లల షూస్, సాక్స్ దొంగలు ఎత్తుకుపోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. తాజాగా మంగళవారం అర్ధరాత్రి రామంతాపూర్ శాంతినగర్ జెండా వద్ద ఉన్న చిట్టిబాబు అనే వ్యక్తి కుటుంబంతో పై పోర్షన్‌లో నిద్రిస్తూ.. ఉండగా దొంగలు కింది గదిలో ఉన్న సుమారు 50 కిలోల బియ్యాన్ని ఎత్తుకెళ్తున్నారు. బుధవారం సీసీ కెమెరాలు పరిశీలిస్తే ఇంటింటికీ తిరిగి రేషన్ బియ్యం కొనే ఓ యువకుడు దొంగతనం చేశాడని, గుర్తించి అతడిని పోలీసులకు అప్పగించారు.

బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలి



ఈసీఐఎల్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

కుషాయిగూడ: బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీఎస్.బోస్ డిమాండ్ చేశారు. బీసీల 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ బుధవారం సీపీఐ జిల్లా సమితి, బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, ఈసీఐఎల్ చౌరస్తాలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల అమలుకు ఈనెల 18న నిర్వహించ తలపెట్టిన రాష్ట్రబంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. బీసీ సామాజికవర్గాలకు చెందిన ప్రజలంతా ఐక్యతను చాటి బీసీ రిజర్వేషన్లను సాధించుకోవాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, బీసీ హక్కుల సాధన సమితి అధ్యక్షుడు బాపిరాజు, దశరథ్, కృష్ణ సీపీఐ నేతలు శ్రీనివాస్, ప్రమీల, మహాలక్ష్మి, మాధవి, నరేందర్, ప్రసాద్, నరసింహ, ధర్మేంద్ర, సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిట్ట కొంచెం.. ఆలోచన ఘనం !

సైకిల్‌కు 'ఎల్' బోర్డుతో ఆదర్శంగా బాలుడు



జమ్మిగడ్డలో 'ఎల్' బోర్డుతో సైకిల్‌పై వెళ్తున్న బాలుడు

కాప్రా: కార్లు, బైక్‌లకే కాదు.. సైకిల్‌కు కూడా.. 'ఎల్' బోర్డు వేసి పలువురికి ఓ బాలుడు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఏఎస్‌రావునగర్ జమ్మిగడ్డ నుంచి కాప్రా ఎల్లారెడ్డిగూడ మార్గంలో ఓ బాలుడు స్కూల్ నుంచి తన చిన్న సైకిల్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో తాను సైకిల్ నేర్చుకునే దశలో ఉన్నానని, వెనుక నుంచి ముందు నుంచి వచ్చేవారు కాస్తా.. చూసి వెళ్లండని, ఎల్ బోర్డు వేసుకుని వెళ్తున్నాడు. చిన్నవాడైనా అందరికీ ఓ మంచి మెసేజ్ ఇచ్చేలా వెళ్తుండటంతో బాలుడిని పలువురు అభినందిస్తున్నారు. లర్నింగ్ లైసెన్స్‌తో ఉండి ఎల్ బోర్డు లేకుండా తిరిగేవారికి కనీస బాధ్యత లేకుండా చిన్నపిల్లలకు వాహనాలు ఇచ్చి ప్రమాదాల్లోకి నెట్టేలా ప్రోత్సహిస్తున్న కొందరికి ఈ బాలుడి ఆలోచనతోనైనా కనువిప్పు కలగాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

రహదారి మూసివేత



రూట్‌మ్యాప్‌ను పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసరావు

మౌలాలి: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని వినాయక నగర్ డివిజన్‌లోని కాకతీయ నగర్ రేణుకా ఎల్లమ్మ ఆలయం నుంచి సంతోషిమాత ఆలయం వరకు 500 మీటర్ల పైప్‌లైన్ పనులు చేపట్టడంతో వినాయకనగర్ నుంచి ఓల్డ్ సఫిల్‌గూడ వెళ్లే ప్రధాన రహదారిని అధికారులు 25 రోజులు మూసివేస్తున్నట్లు మల్కాజిగిరి ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానికంగా పరిశీలించిన ఆయన మాట్లాడుతూ.. 16–సీ, కే బస్సులను ఆనంద్‌బాగ్ నుంచి ఆర్టీసీకాలనీ, భరత్‌నగర్ మీదుగా ఈసీఐఎల్ వైపు మళ్లిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

స్నేహితుడిపై దాడి.. కేసు నమోదు

మల్కాజిగిరి: ఓ వ్యక్తి స్నేహితుడిపై దాడిచేసిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మౌలాలి హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన ఆవుల సురేష్ ఆటో డ్రైవర్. కాగా విష్ణుపురికాలనీకి చెందిన లక్ష్మణ్ ఇద్దరూ స్నేహితులు. కాగా లక్ష్మణ్ సురేష్ బైక్ తనఖా పెట్టి డబ్బులు తీసుకున్నాడు. తనఖా పెట్టిన బైక్ విడిపించమని అనేకసార్లు అడిగినా విడిపించలేదు. దీంతో ఈనెల 14న సురేష్ నిలదీయడంతో అతడి ఆటో అద్దం పగులగొట్టి దాడికి పాల్పడ్డాడు. బాధితుడిని కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుర్వాసన నుంచి రక్షించాలని ధర్నా



చెంగిచెర్లలో ధర్నా చేస్తున్న స్థానికులు

బోడుప్పల్: చెంగిచర్ల స్లాటర్‌హౌజ్ లోపల జంతు వ్యర్థాల నుంచి నూనె తీస్తున్నారని ఆరోపిస్తూ.. చెంగిచర్ల వాసులు ధర్నా చేశారు. మాజీ కార్పొరేటర్ కొత్త చందర్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం చెంగిచర్ల వాసులు స్లాటర్‌హౌజ్‌లో సదరు ప్రదేశాన్ని సందర్శించారు. ఆయిల్ ట్యాంకర్లలో ఉన్న వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేకల మండిలో ఐదెకరాల స్థలంలో ఎముకలు, వ్యర్థాల ద్వారా నూనె ఉత్పత్తి చేయడంతో పాటు చర్మాల వ్యర్థాలను స్టోరేజ్ చేయడం వల్ల విపరీతమైన దుర్వాసన వస్తుందన్నారు. ఈ కాలుష్యం వల్ల స్థానిక ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయన్నారు. దట్టమైన పొగతో కాలుష్యం వెదజల్లుతోందని దాని బారి నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. 3 రోజుల్లోగా నూనెల తయారీ కేంద్రాన్ని తొలగించకపోతే జీహెచ్ఎంసీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, బోడుప్పల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి మూసివేయిస్తామన్నారు. బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు కుర్రి శివ శంకర్, నేతలు కొత్త సుశాంత్‌గౌడ్, రంగ బ్రహ్మన్నగౌడ్, గణేష్‌నాయక్, ఉమేష్‌చారి, బండారు సాయి, లింగస్వామి, కట్ట జగన్, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కార్పొరేటర్ శ్రీదేవి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై బుధవారం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో జరుగుతున్న యూజీడీ, బాక్స్‌డ్రైన్, సీసీరోడ్లు, బీటీ రోడ్డు పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. ఇంకా రోడ్లు అవసరమైన కాలనీలకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఇంజినీరింగ్ డీఈ బాలకృష్ణ, ఏఈ అభిషేక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల అదుపు

బోడుప్పల్: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను పూర్తిస్థాయిలో అదుపు చేయొచ్చని మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవింద్‌రెడ్డి అన్నారు. చెంగిచర్లలోని కమలానగర్ కాలనీలో 26 సీసీ కెమెరాలను కాలనీవాసులు సమక్షంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల భద్రత, శాంతి, శ్రేయస్సుకు ఆధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇవి దొంగతనాలు అరికట్టేందుకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. నేరాల నియంత్రణకు చట్టవ్యవస్థ పర్యవేక్షణలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ఎస్సై ఉదయ్‌భాస్కర్, కాలనీ అధ్యక్షుడు కొత్త మురళీగౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

బధిరుల పాఠశాలలో వైద్య శిబిరం



అల్వాల్: లయన్స్ క్లబ్ ఆఫ్ అల్వాల్ ఆధ్వర్యంలో బుధవారం నేరెడ్‌మెట్‌లోని హెలెన్ కెల్లెర్ బధిరుల పాఠశాలలో ఉచిత కంటి, దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా అద్దాలు, శస్త్రచికిత్సలు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ నీలేష్, డాక్టర్ జానకి, లయన్స్‌క్లబ్ సభ్యులు సత్యనారాయణరావు, జయంతి, రవీంద్రన్, కిష్టయ్య, యాదగిరి, అశోక్, సంఘ సేవకులు సురేందర్‌రెడ్డి, బాలానగర్ లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

మల్లాపూర్: సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరం లాంటిదని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్‌కు చెందిన ఎండీ మిస్బా అనారోగ్యంతో బసవతారకం ఆసుపత్రిలో చికిత్స చేయించాలని కాంగ్రెస్ సీనియర్ నేత నెమలి అనిల్‌కుమార్ తెలపారు. అత్యవసర చికిత్సకు సీఎం ఎల్‌ఓసీ ద్వారా రూ.3 లక్షలు మంజూరు చేయించి బుధవారం వారి కుటుంబ సభ్యులకు మందముల పరమేశ్వర్‌రెడ్డి అందజేశారు. కాంగ్రెస్‌నేతలు తాండ్ర శ్రీకాంత్‌రెడ్డి, పీఎస్ఎన్ చౌదరి తదితరులున్నారు.



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న పరమేశ్వర్‌రెడ్డి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

సీసీరోడ్డు పనుల పరిశీలన

మౌలాలి: డివిజన్ సాయినాథపురంలో జరుగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ గున్నాల సునీతాశేఖర్‌యాదవ్ బుధవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. పనుల నాణ్యత విషయంలో రాజీలేకుండా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు

● సాక్షి వరుస కథనాలకు స్పందించిన హెచ్‌ఎండీఏ
● రూ.14.87 కోట్ల నిధుల కేటాయింపు

సాక్షి ఎఫెక్ట్..

ఉప్పల్: ప్రజా సమస్యలపై సాక్షి దినపత్రికలో ప్రచురించిన వరుస కథనాలకు ఎట్టకేలకు హెచ్‌ఎండీఏ అధికారులు స్పందించారు. స్థానికులు, నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను సాక్షి వెలుగులోకి తీసుకొచ్చింది. 'భగాయత్‌లో కంపు కంపు..' 'పేరు గొప్ప ఊరు దిబ్బ' అనే శీర్షికలతో ప్రచురితమైన కథనాలకు అధికారులు స్పందించారు.

అధికార యంత్రాంగం సన్నద్ధం..

ఉప్పల్ భగాయత్‌లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. రూ.14.87 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఉప్పల్ భగాయత్‌లో శరవేగంగా భవన నిర్మాణాలు, నివాసాలు, అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు ఏర్పాటయ్యాయి. వేలాది కుటుంబాలు అక్కడ నివాసం ఉంటున్నారు. దాదాపు 50 వేలకు పైగా జనాభా నివసిస్తోంది. స్థానిక సమస్యలపై ఎన్నో వినతులు, ఫిర్యాదులు, సాక్షి దినపత్రికలో వరుస కథనాలు ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఉప్పల్ భగాయత్ హెచ్‌ఎండీఏ లేఅవుట్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు రంగం సిద్ధం చేస్తోంది. తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం, విద్యుత్ సరఫరా తదితర సదుపాయాలు కల్పించనున్నారు.



భగాయత్ హెచ్‌ఎండీఏ లే అవుట్ ముఖద్వారం

ఇంకుడు గుంత శుభ్రం

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని చిన్మయిమార్గ్‌లో ఇంకుడుగుంత వ్యర్థాలతో నిండిపోయి ఉండటంతో ఈనెల 10న సాక్షిలో 'డంపింగ్ యార్డు కాదు.. ఇంకుడు గుంతే' అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికార బృందం బుధవారం ఇంకుడు గుంతను శుభ్రం చేయించారు. ఇందుకు కాలనీవాసులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డుకు ప్యాచ్‌వర్క్స్

గౌతంనగర్: 12న సాక్షిలో 'అధ్వాన్న రోడ్లు.. అవస్థలమయం'.. అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన జీహెచ్‌ఎంసీ అధికారులు అన్నపూర్ణ సొసైటీ, ఉత్తమ్‌నగర్ ఏకేసీ బస్టాప్ వద్ద రోడ్డుకు మరమ్మతులు చేయించారు.



చిన్మయిమార్గ్‌లో శుభ్రం చేసిన అనంతరం ఇలా..



అన్నపూర్ణ సొసైటీలో మరమ్మతులు చేసిన దృశ్యం


సాక్షి
దరాబాద్
భాగాయత్
పేరు గొప్ప
ఊరు దిబ్బ

ప్రచురితమైన కథనం..